

కొలువుల కళాశాల
● 100 పోస్టుల్లో 78 ప్రభుత్వ ఉద్యోగాలు
కంది వ్యవసాయ కళాశాల విద్యార్థులకే 7



ప్రథమాంధ్ర మహాసభ వేదిక.. గ్రంథాలయోద్యమ చైతన్య దీపిక

● నిజాం రాజ్యంలో భాషా, సంస్కృతి పరిరక్షణకు నడుం బిగించిన జోగిపేట

జోగిపేట, సెప్టెంబరు 16 : నాటి నిజాం రాజ్యంలో భాషా, సంస్కృతులను పరిరక్షించడానికి ఉత్తేజితులను చేసిన 'ఆంధ్ర మహాసభ'కు జోగిపేట పట్టణం తొలివేదికగా నిలిచింది. 1930 మార్చి 3, 4, 5 తేదీల్లో జోగిపేట వేదికగా స్థానిక వ్యాపారుల అండదండలతో పట్టణంలోని విఠలేశ్వర మందిరంలో నిర్వహించారు. స్థానికులైన బస్వ మాణయ్య, సులుగంటి శివప్ప, అరిగె ఆశయ్య ఏర్పాట్లను చేయగా, ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా ఇదే ప్రాంతానికి చెందిన అనంత వెంకట్రామారావు దేశ్‌పాండే, కార్యదర్శిగా బచ్చు వెంకటేశం గుప్తా వ్యవహరించారు. సమావేశంలో మహామహులు రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా ఉపన్యసించారు. నడింపల్లి సుందరమ్మ అధ్యక్షతన జోగిపేటలో ప్రథమాంధ్ర మహిళా సభను కూడా నిర్వహించగా, స్థానిక వనిత విరాబాయి అధ్యక్షత వహించారు. అప్పట్లో ఉవ్వెత్తున ఎగిసిన గ్రంథాలయోద్యమానికీ మొదటగా స్పందించింది కూడా జోగిపేటనే కావడం విశేషం. స్థానిక వ్యాపారులు, వర్తకుల సహకారంతో జోగిపేటలోని క్లాక్‌టవర్ వద్ద 'జోగినాథాంధ్ర గ్రంథాలయా'న్ని ఏర్పాటు చేశారు. పలు పత్రికలు, పుస్తకాల ద్వారా నిజాం రాచరిక వ్యవస్థ, వారి నిరంకుశ పాలన పట్ల ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారు.



ప్రథమాంధ్ర మహాసభకు వేదికగా నిలిచిన శ్రీవిఠలేశ్వర మందిరం

యోధులకు గుర్తింపేదీ



సంగారెడ్డి, గుల్బర్గా, చంచల్‌గూడ జైళ్లల్లో 10 నెలలు కఠిన కారాగార శిక్షను అనుభవించా. తొలినాళ్లలో గౌరవంగానే ఉన్నా, తర్వాత పట్టించుకోవడం మానేశారు. కాసింత పెన్షన్‌ను ఇస్తూ సరిపెట్టుకోమన్నారు. సంవత్సరానికోసారి పిలిచి దండ వేసి దండం పెట్టడం కాదు.. సరైన గుర్తింపు ఇవ్వాలి. కోరిన చోట పదెకరాల వ్యవసాయ భూమి, 300 గజాల ఇంటి స్థలాన్ని ఇవ్వాలని చట్టం చెబుతున్నా అమలుకు నోచుకోలేదు. జిల్లాలో 600 మంది స్వతంత్ర యోధులుండగా, నేడు 25 మందే బతికున్నారు. ప్రజలకు తెలిసేలా మాకు సరైన గుర్తింపును ఇవ్వాలని కోరుతున్నాం.

- గడీండ్ల లింగమయ్యగౌడ్, స్వాతంత్ర్య సమరయోధుల సంఘం జిల్లా అధ్యక్షుడు

నిమజ్జన సందడి

మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో నిమజ్జన సందడి మొదలైంది. నవరాత్రులు ముగియడంతో పలుచోట్ల గణపయ్యలు గంగమ్మ ఒడికి చేరుతున్నాయి. శోభాయాత్రలు నిర్వహించి చిన్నాపెద్ద చిందేస్తూ నిమజ్జనానికి కదిలారు. మెదక్, సంగారెడ్డి పట్టణాల్లో మంగళవారం రాత్రి విగ్రహాల శోభాయాత్రలు ప్రారంభం కానున్నాయి. బుధవారం ఉదయం నుంచి విగ్రహాల నిమజ్జనం ఊపందుకుని రాత్రి వరకు కొనసాగనున్నది. పోలీసులు భారీ ఎత్తున బందోబస్తును ఏర్పాటు చేశారు.

● శోభాయాత్రలకు మండప నిర్వాహకులు సిద్ధం
● మెదక్‌లో కొంటూర్, సంగారెడ్డిలో మహబూబ్‌సాగర్ చెరువు వద్ద ఏర్పాట్లు
● చెరువు కట్టపై విద్యుత్ దీపాల వెలుగులు
● నిమజ్జనానికి భారీ క్రేన్‌ల వినియోగం
● అందుబాటులో గజ ఈతగాళ్లు



సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్‌సాగర్ చెరువు వద్ద లైటింగ్

మెదక్ అర్బన్/మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబరు 16 : నవరాత్రులు భక్తుల పూజలందుకున్న గణనాథుల నిమజ్జనానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మెదక్ మండల పరిధిలోని కొంటూర్, పిట్లంచెరువు వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 2,975 వినాయకులను భక్తులు నెలకొల్పారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ఎక్కువగా ప్రతిష్ఠించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో గణేష్ శోభాయాత్రలు ప్రశాంతంగా సాగేందుకు చర్యలు తీసుకున్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగాలో 1400 వినాయకుల నిమజ్జనం పూర్తి చేసుకున్నాయి. మంగళవారం రాత్రి నుంచి ప్రారంభమయ్యే నిమజ్జనం బుధవారం రాత్రి వరకు కొనసాగుతోంది. ఒక్కొక్కటిగా విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్తున్నాయి. నిమజ్జన కేంద్రాల వద్ద రెవెన్యూ, విద్యుత్, మున్సిపల్‌శాఖ అధికారులు, క్రేన్లు, లైటింగ్‌తోపాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడకుండా అవసరమైన చర్యలు చేపట్టారు. మెదక్ ఆర్డీవో రమాదేవి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. గణేష్ శోభయాత్రకు మెదక్ జిల్లా వ్యాప్తంగా 800 మంది పోలీసులతో పటిష్ఠ భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎప్పటికప్పుడు జిల్లా కేంద్రంలో ఆయన పర్యటిస్తూ.. బందోబస్తును పర్యవేక్షిస్తున్నారు. సిబ్బందికి పలు సూచనలు వేస్తున్నారు. జిల్లా కేంద్రంలో 300 మంది పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. స్పెషల్ పెట్రోలింగ్ వాహనాల ఏర్పాటు, ఐడీపార్టీ, షీటీమ్, ప్రత్యేకంగా బందోబస్తు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఊరేగింపు వెళ్లే దారిలో ఏదైనా ప్రార్థనా స్థలం దగ్గర ఆపకూడదన్నారు. గణేష్ విగ్రహాలను తీసుకెళ్లే వాహనాలపై ఎక్కువ మంది ఉండకుండా చూడాలన్నారు. పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 8712657888 ఏర్పాటు చేశామన్నారు.

పగడ్బందీగా ఏర్పాట్లు : కలెక్టర్ రాహుల్‌రాజ్

వినాయక నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పగడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో ఏర్పాట్లును పరిశీలించారు. మండల పరిధిలోని కొంటూర్ చెరువు వద్ద బారికేడ్లు, 3 క్రేన్లు, ఎక్స్‌కవేటర్‌తో పాటు 10 మంది గజ ఈతగాళ్లు అందుబాటులో ఉంచామన్నారు. పరిసరాల పరిశుభ్రతకు శానిటేషన్ సిబ్బంది నియమించినట్లు కలెక్టర్ వెల్లడించారు.



కొంటూరు చెరువు వద్ద ఏర్పాట్లను కలెక్టర్ రాహుల్‌రాజ్

సంగారెడ్డి జిల్లాలో 1200 మందితో బందోబస్తు

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 16 : సంగారెడ్డి జిల్లాలో వ్యాప్తంగా మంగళవారం నిర్వహించనున్న గణనాథుని శోభాయాత్రకు సర్వం సిద్ధం చేశారు. నిమజ్జనం సందర్భంగా 1200 మంది పోలీసులతో గట్టి బందోబస్తు నిర్వహించనున్నారు. సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్‌సాగర్ చెరువు వద్ద మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, డీఈ ఇంతియాస్ అహ్మద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సైదులు ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. రోడ్డుకు ఇరువైపులా చెత్తా చెదారాన్ని తొలగింపజేసి, బారికేడ్లను ఏర్పాటు చేశారు. నిమజ్జనం కోసం రెండు క్రేన్‌లను వినియోగించనున్నారు. పట్టణంలోని వివిధ కాలనీల్లో మండపాల వద్ద విగ్రహాలను వాహనాల్లో పెట్టడానికి మరో క్రేన్‌ను ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా పోలీసులు రోడ్డు డైవర్షన్ చేస్తున్నారు. ప్రధాన కూడళ్లలో మసీదులు, దర్గాలు, చర్చీలపై రంగులు పడకుండా ఎత్తయిన బారికేట్స్‌తో పాలిథిన్ కవర్లను ఏర్పాటు చేశారు. చెరువుల వద్ద గత ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. గణేష్ ఉత్సవ కమిటీ, మండప నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని ఎస్పీ చెన్నూరి రూపేష్ కోరారు. విగ్రహాలు తీసుకెళ్లే వాహనంలో ఆయుధాలు, మందుగుండు సామగ్రి, మండే స్వభావం గల పదార్థాలు పెట్టకూడదని సూచించారు. విగ్రహాలను తీసుకెళ్లే వాహనాల డ్రైవర్ల పూర్తి వివరాలు పోలీసులకు ముందుగానే తెలియజేయాలన్నారు. స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, క్విక్ రియాక్షన్ టీమ్స్ సిద్ధంగా ఉన్నాయని ఎస్పీ రూపేష్ తెలిపారు.



నిమజ్జనానికి తరలుతున్న మెదక్‌లోని కోదండ రామాలయ గణనాథుడు

లడ్డూ అ'ధర'హో



ఎద్దుమైలారంలో లడ్డూను దక్కించుకున్న నల్ల రాంరెడ్డిని సన్మానిస్తున్న మల్లారెడ్డి

కంది/రామచంద్రాపురం/పెద్దశంకరంపేట, సెప్టెంబరు 16 : వినాయక మండపాలలో ఏర్పాటు చేసిన లడ్డులకు నిర్వహిస్తున్న వేలంలో పలుచోట్ల అధిక ధరలు పలుకుతున్నాయి. కంది మండలం ఎద్దుమైలారంలో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన లడ్డూ వేలంలో ఆ గ్రామానికి చెందిన నల్ల రాంరెడ్డి-శ్రీలత దంపతులు రూ.3,01,111 లక్షలకు దక్కించుకున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ బాలగణేష్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లడ్డూను కౌన్సిలర్ అంతగిరిపల్లె చిట్టి ఉమేశ్వర్ రూ.2.80 లక్షలకు తీసుకున్నారు. ఇదే మండపంలోని చిన్న లడ్డూను రూ. 1.25 లక్షలకు దర్శనం మురళీ కైవసం చేసుకున్నారు. పెద్దశంకరంపేట మండల పరిధిలోని మక్త లక్ష్మాపూర్‌లో విద్యార్థి యువసేన ఆధ్వర్యంలోని లడ్డును రూ.లక్ష వెయ్యికి బైండ్ల నవీన్ దక్కించుకున్నారు.

డల్లాస్‌లో వినాయకుడు..
మెదక్‌లో పూజారి

● ఆన్‌లైన్‌లో పూజలు చేస్తున్న మహేష్‌శర్మ

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబరు 16 : ఆన్‌లైన్‌లోనూ మంత్రాలు వినిపిస్తుండగా అమెరికాలో ఏర్పాటు చేసిన గణనాథుడు సైతం పూజలందుకుంటున్నాడు. తెలంగాణకు చెందిన చాలా మంది అమెరికా డల్లాస్ నగరంలోని హనీక్రిక్ కాలనీలో స్థిరపడ్డారు. ఇందులో మెదక్‌కు చెందిన పలువురు, మరికొందరు కలిసి అక్కడ గణపతి ఉత్సవాలు చేస్తున్నారు. అక్కడ వినాయకుడికి పూజలు చేసేదుకు పూజారులు దొరకని నేపథ్యంలో మెదక్ పట్టణానికి చెందిన దోర్బల మహేష్‌శర్మను సంప్రదించారు. ప్రతీ రోజు సాయంత్రం 6 గంటలకు.. డల్లాస్‌లో ఉదయం 7 గంటలకు వీడియోకాలింగ్ ద్వారా పూజలు చేశారు. మండల పరిధిలోని పేరూరు గరుడ గంగ ఆవరణలో వెలసిన సరస్వతీ ఆలయంలో మహేష్‌శర్మప్రధాన అర్చకుడిగా పనిచేస్తున్నారు.



ఆన్‌లైన్‌లో పూజ చేస్తున్న మహేష్‌శర్మ

పరిశుభ్రంగా పల్లెలు

● నేటి నుంచి స్వచ్ఛతా హీ సేవ
● గాంధీ జయంతి వరకూ కార్యక్రమాలు

మెదక్, సెప్టెంబరు 16, గ్రామాల్లో ఎక్కడ చూసిన వైరల్ ఫీవర్లు ప్రబలుతున్నాయి. చికున్ గున్యా, డెంగ్యూతో జనం విలవిలలాడి పోతున్నారు. ఈ క్రమంలో పల్లెల్లో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో మంగళవారం నుంచి స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని అక్టోబరు 2 వరకు ఈ కార్యక్రమం సాగనుంది. ఈ కార్యక్రమంల భాగంగా జిల్లాలోని 493 గ్రామాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించడానికి అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. కార్యక్రమంలో భాగంగా పంచాయితీ భవనాలు, అంగన్‌వాడి కేంద్రాలు, చౌరస్తాల వద్ద చెత్తా చెదారాలు, మురుగునీటిని తొలగించనున్నారు. ఇందులో స్వచ్ఛంద సంస్థలు, యూత్ క్లబ్‌ల సభ్యులను భాగస్వామ్యం చేస్తూ శ్రమదానంతో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని భావిస్తున్నారు. గ్రామీణాభివృద్ధి సిబ్బందితో కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని మెదక్ డీపీవో యాదయ్య తెలిపారు. సాధారణ బడ్జెట్ నుంచి ఇందుకు నిధులు వినియోగిస్తామన్నారు.

అన్ని గ్రామాల్లో నిర్వహణ : కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 16 : జిల్లాలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని ఈ నెల 17వ తేదీ నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తున్నట్టు సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 15 రోజుల పాటు నిర్వహించనున్నట్టు ఈ కార్యక్రమంలో ప్రజలందరినీ భాగస్వాములను చేయాలని అధికారులకు సూచించారు. స్వచ్ఛతా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత ప్రతిజ్ఞ, మానవహారాల ఏర్పాటు, గ్రామ సభలు నిర్వహించాలని తెలిపారు. తల్లి పేరుతో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటేలా చూడాలని పేర్కొన్నారు. విద్యార్థులకు స్వచ్ఛత కార్యక్రమంపై వివిధ రకాల పోటీ పరీక్షలను నిర్వహించాలని, ఇంటింటికీ తిరిగి స్వచ్ఛత కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామీణ అభివృద్ధి శాఖ, ఎస్‌హెచ్‌జీ, మహిళా సంఘాల సభ్యులు, ఉపాధి హామీ సిబ్బంది కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

పండుగలా ప్రజాపాలన దినోత్సవం

● మెదక్‌లో కలెక్టరేట్‌లో వేడుకలు.. ఏర్పాట్లు పూర్తి
● జెండా ఆవిష్కరించనున్న రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

మెదక్ అర్బన్, సెప్టెంబరు 16: ప్రజాపాలన దినోత్సవ వేడుకలకు మెదక్ ముస్తాబైంది. పండుగ వాతావరణంలో దినోవత్సవ వేడుకలను నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. సోమవారం కలెక్టర్ రాహుల్‌రాజ్ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంగళవారం ఉదయం 11 గంటలకు రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. అనంతరం పోలీసు గౌరవ వందనం స్వీకరించి.. సందేశం ఇస్తారన్నారు. అన్ని శాఖల అధికారులు ఉదయం 9 గంటలకు కార్యాలయానికి చేరుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.



విద్యుత్ దీప కాంతుల్లో మెదక్ కలెక్టరేట్

గంజాయ్

బీదర్ నుంచి సుమారు రెండున్నర కిలోల ఎండు గంజాయి కొనుగోలు చేసి జహీరాబాద్‌కు తీసుకువచ్చి వాటిని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయిస్తున్న ఆరుగురిని సుభాష్‌గంజ్‌లో ఆగస్టు 30న పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

హైదరాబాద్ నుంచి జహీరాబాద్ వైపు వస్తున్న మహీంద్రా బొలెరో ట్రాలీ వాహనాన్ని తనిఖీ చేయగా ట్రాలీ కింది భాగంలో చెక్కలను ఏర్పాటు చేసి 140 కిలోల ఎండు గంజాయి ప్యాకెట్లు రవాణా చేస్తూ సెప్టెంబరు 10న పోలీసులు, టాస్క్‌ఫోర్స్ బృందానికి చిక్కారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఇలా జిల్లాల్లో గంజాయి విక్రయాలు, రవాణా చేస్తూ పట్టుబడుతూనే ఉన్నారు.

● సరిహద్దులు దాటుతున్న మత్తు పదార్థాలు
● జిల్లాలో విచ్చలవిడిగా అమ్మకాలు
● చాక్లెట్ల రూపంలో కాలేజీలకు సరఫరా



సెప్టెంబరు 15 వరకు జిల్లాలో నమోదైన వివరాలు	
కేసులు	65
అరెస్టులు	64
స్వాధీనం	1127 కిలోలు
విలువ	దాదాపు రూ.2.95 కోట్లు

సంగారెడ్డి క్రైం, సెప్టెంబరు 16 : గంజాయి నిర్మూలన కోసం పోలీసు యంత్రాంగం ఎంత కట్టడి చేస్తున్నప్పటికీ స్మగ్లర్లు మాత్రం కొత్త దారులు వెతుకుతున్నారు. జిల్లా మీదుగా సరిహద్దులు దాటించి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. స్మగ్లర్ల తీరు చూస్తే సినిమా సన్నివేశాలను తలపిస్తున్నాయి. వాహనాల్లో బయటకు కనపడే విధంగా కూరగాయలు బాక్సులు పెట్టి, కింద ప్రత్యేకంగా అమర్చిన విభాగంలో గంజాయి ప్యాకెట్లు తరలిస్తున్నారు. ఒడిశా రాష్ట్రం మల్కాన్‌గిరి నుంచి ఈ గంజాయిని తీసుకువచ్చి సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ సరిహద్దు ప్రాంతం మీదుగా మహారాష్ట్రలోని ముంబయ్, పూణే, లాతూర్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారు. కొంతభాగం జిల్లాలోని కొందరు వ్యక్తులకు అప్పగించి కాలేజీలు, మార్కెట్ ప్రాంతాలను ఎంపిక చేసుకొని అమ్ముతున్నారు. పోలీసులు పలుమార్లు అడ్డుకున్నప్పటికీ స్మగ్లర్లు అదేపనిగా కొనసాగిస్తున్నారు.



చిరాగ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన గంజాయి, నిందితులను చూపుతున్న ఎస్పీ రూపేష్ (ఫైల్)

చాకెట్ల రూపంలో సరఫరా

గంజాయి ప్యాకెట్లు విక్రయిస్తే పోలీసులకు దొరికిపోతామనే ఉద్దేశంతో కొందరు చాక్లెట్ల రూపంలో తయారు చేస్తున్నారు. వీటిని వివిధ ఇంజనీరింగ్ కాలేజీలు, రద్దీగా ఉండే మార్కెట్ ప్రాంతాల్లో గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. జిల్లాలోని సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజనీరింగ్ కాలేజ్‌లో కొందరు విద్యార్థుల వద్ద ఇటీవల గంజాయి పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని టీజీ న్యాబ్ డైరెక్టర్ స్వయంగా ప్రకటించారు. పటిష్ఠ భద్రత, 24 గంటల పాటు అధికారుల పర్యవేక్షణలో ఉండే యూనివర్సిటీలోకి గంజాయి మహమ్మారి ప్రవేశించి యువతను మత్తులో ముంచేస్తుంది. పటాన్‌చెరు సమీపంలోని గీతం విశ్వ విద్యాలయం విద్యార్థులే లక్ష్యంగా కొందరు గంజాయి వ్యాపారులు చాక్లెట్ల రూపంలో గంజాయిని అందజేస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. గీతం విశ్వ విద్యాలయం సరిసర ప్రాంతాల్లో కొన్ని నెలల క్రితం టాస్క్‌ఫోర్స్ పోలీసులు తనిఖీలు నిర్వహించి గంజాయి చాకెట్లను భారీగా స్వాధీనం చేసుకున్నారు.

కార్మికులే లక్ష్యంగా అమ్మకాలు

జిల్లాలోని పటాన్‌చెరు, జహీరాబాద్, జిన్నారం మండలాల్లో బీహార్, రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ తదితర రాష్ట్రాలకు చెందిన కార్మికులు వేల సంఖ్యలో ఉన్నారు. ఆయా మండలాల్లో ఉన్న పరిశ్రమల్లో పనిచేస్తున్న వీరిలో కొంతమంది మత్తు పదార్థాలకు అలవాటుపడుతున్నారు. ఉదయం నుంచి రాత్రివరకు విధులు నిర్వహించి ఉపశమనం కోసం గంజాయి వంటి మత్తుకు బానిసలుగా మారుతున్నారు. దీంతో వ్యాపారులు వారికి చాక్లెట్లు, ప్యాకెట్ల రూపంలో అందజేసి సొమ్ము చేసుకుంటున్నారు.

గంజాయి రవాణాపై ఉక్కుపాదం



జిల్లాలో గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నాం. ఒడిషా రాష్ట్రం నుంచి మహారాష్ట్రకు సరిహద్దు ప్రాంతం అయిన జిల్లా మీదుగా స్మగ్లర్లు రవాణా సాగిస్తున్నారు. వారి ఆగడాలకు చెక్ పెడుతున్నాం. జిల్లాలో టాస్క్‌ఫోర్స్ బృందం గంజాయి రవాణా అరికట్టేందుకు అహర్నిశలు కృషి చేస్తుంది. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేశాం. యువత గంజాయికి బానిసలుగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దు. ఉజ్వల భవిష్యత్ కోసం మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచిస్తూ కాలేజీలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. జిల్లాలో గంజాయి రవాణా చేసిన, విక్రయించినా టీ న్యాబ్ 8712656777 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని, లేదా వాట్సాప్ ద్వారా తెలియజేయాలి. నిర్భయంగా ఫిర్యాదు చేసినప్పుడే సమాజానికి మేలు చేసినవారం అవుతాం

- రూపేష్, జిల్లా ఎస్పీ

నేడు చక్రియాల్‌లో అనంత చతుర్దశి



దిండి కార్యక్రమంలో భక్తులతో కలిసి పాదయాత్ర చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పుల్‌కల్, సెప్టెంబరు 16: చౌటకూర్ మండలం చక్రియాల గ్రామంలో 17న శ్రీలక్ష్మీ అనంతపద్మనాభస్వామి చతుర్దశి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అతి పురాతనమైన ఆలయంలో అభిషేకాలు, పూజలు చేపట్టనున్నారు. ఉదయం 7.30 గంటలకు స్వామివార్లకు అభిషేకం, మహా పూజలు, అనంత వ్రతాలు జరగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆలయ ప్రధాన అర్చకులు మహారాజుల రామకృష్ణశర్మ, నిర్వాహకుడు లక్ష్మణ్ కోరారు.

సంజీవన్‌రావుపేటలో 'దిండి'

నారాయణఖేడ్, సెప్టెంబరు 16: ఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటలో అఖండ హరినామ సప్తాహ ముగింపులో భాగంగా సోమవారం పాండురంగ విఠలేశ్వరుడి దిండి కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మాజీ మండలాధ్యక్షుడు సాయిరెడ్డి, ఎంపీటీసీ భూపాల్ భక్తులతో దిండి పాదయాత్రలో పాల్గొన్నారు.



చక్రియాల గ్రామంలోని శ్రీలక్ష్మీ అనంతపద్మనాభస్వామి ఆలయం

శివాలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం

జిన్నారం, సెప్టెంబరు 16: మంగంపేటలో నిర్మిస్తున్న శివాలయానికి మంగంపేటకు చెందిన జంగం వీరప్ప కుటుంబసభ్యులు సోమవారం ఆలయ నిర్మాణ పనుల కోసం రూ.లక్షను నాయకులు మల్లేశం, నరేందర్, రఘు, లక్ష్మణ్, వెంకటేశ్, శేఖర్‌రెడ్డిలకు అందజేశారు.

మద్యం మత్తులో మహిళ వీరంగం

● వాహనాల రాకపోకలకు అంతరాయం



పట్టణంలోని భవానీ మందిర్ చౌరస్తా వద్ద బస్సును అడ్డుకుంటున్న మహిళ

జహీరాబాద్, సెప్టెంబరు 16: మద్యం మత్తులో మహిళ వీరంగం సృష్టించింది. జహీరాబాద్ పట్టణంలోని భవానీ మందిర్ చౌరస్తా వద్ద వాహనాలను అడ్డగిస్తూ ఇబ్బందులకు గురిచేసింది. సుమారు గంట పాటు ఈ తతంగం జరిగింది. వాహనాలకు అడ్డు తగలడంతో కాసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. చుట్టుపక్కల వారు, బస్సు డ్రైవర్ పరిస్థితులను గమనించి ఆమెకు సర్దిచెబుతూ పక్కకు తరలించారు. దీంతో వాహనదారులు ఊపిరిపీల్చుకున్నారు.

'పూజారులకు గౌరవ వేతనం చెల్లించాలి'

నారాయణఖేడ్, సెప్టెంబరు 16: గిరిజనతండాల్లోని భవానీమాత, సేవాలాల్ మహరాజ్ ఆలయాల పూజారులకు దూపదీప నైవేద్య పథకంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనాలను చెల్లించాలని ఖేడ్ తాజామాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ కోరారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మూడేళ్లుగా గౌరవ వేతన చెల్లింపులు నిలిచిపోయాయని తెలిపారు. కలెక్టర్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి స్పందించి గౌరవ వేతనాలు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

జిల్లాస్థాయి పోటీలకు 'ఆక్స్‌ఫర్డ్' విద్యార్థులు

జోగిపేట, సెప్టెంబరు 16: జోగిపేట పట్టణానికి చెందిన ఆక్స్‌ఫర్డ్ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన మశ్చేందర్, గిరిధర్‌లు అండర్-17 బాలుర కబడ్డీ విభాగంలో జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. కాగా అండర్-14 బాలుర విభాగంలో శ్రీకాంత్, అండర్-17 బాలుర విభాగంలో దుర్గాప్రసాద్, అండర్-17 బాలికల విభాగంలో అసిఫా, అండర్-14 బాలికల వాలీబాల్ పోటీల్లో మధురిమలు జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని వ్యాయామ ఉపాధ్యాయులు నర్సింహులు, భానుతేజ అభినందించారు.

కొత్త యంత్రాలను అభివృద్ధి చేస్తా



నాన్న శ్రీనివాస్‌రెడ్డి హెడ్ కానిస్టేబుల్, అమ్మ విజయ గృహిణి. మిడ్ మానేరు దగ్గర మాకు కొంత పొలం ఉన్నది. అప్పుడడప్పుడు అమ్మ నాన్న పొలం దగ్గరికి తీసుకెళ్లేవారు. అప్పుడు రైతుల పరిస్థితిని గమనించేదాన్ని. 2014-2018 బ్యాచ్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశాను. రోజుకు 12 గంటలపాటు చదివి ఏఈఈ ఉద్యోగం సంపాదించాను. తక్కువ ఖర్చుతో వ్యవసాయానికి ఉపయోగపడేలా కొత్త యంత్రాలను అభివృద్ధి చేసి రైతులకు అందిస్తా.

-గోలి సంజన, కరీంనగర్



కంది వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల వద్ద అధ్యాపకులతో ఏఈఈ ఉద్యోగం పొందిన పూర్వ విద్యార్థులు

కొలువుల కళాశాల

78 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు

- 100 పోస్టుల్లో 78 కంది వ్యవసాయ కళాశాల విద్యార్థులకే..

కంది, సెప్టెంబరు 16 : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. 2011 నుంచి 2018 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు నీటి పారుదల శాఖలో 78 ఏఈఈ (అగ్రికల్చర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్)లుగా ఉద్యోగాలు సాధించారు. 2022 సెప్టెంబరు 15న 100 ఏఈఈ పోస్టులకు నోటిఫికేషన్ వెలువడగా, రాష్ట్ర వ్యాప్తంగా వందలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. దీనికి సంబంధించి 2023 మే 9న పరీక్ష నిర్వహించగా, 2024 జూన్ 23న ఫలితాలు వచ్చాయి. 100 ఏఈఈ పోస్టుల్లో 78 కంది వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకే దక్కగా, అతి త్వరలో కొలువుల్లో చేరనున్నారు. వ్యవసాయ రంగంలో సాంకేతిక విప్లవాన్ని తీసుకొస్తామని ఈ యువ ఇంజనీర్లు గర్వంగా చెబుతున్నారు. అధునాతన పరిజ్ఞానంతో రూపొందించిన యంత్రాలను అందుబాటులోకి తెస్తామని, పాలీహౌస్‌లను ప్రోత్సహించి రైతులకు పంటల ధరలు నిర్ణయించడంలో తమవంతు సహకారం అందిస్తామని వారు పేర్కొంటున్నారు

రోజుకు పది గంటలు చదివా



మాది నల్లగొండ జిల్లా. నాన్న జగన్నాథం, అమ్మ జయమ్మ ఇద్దరూ చేనేత వస్త్రాలు నేస్తారు. మా చుట్టుపక్కల రైతుల కష్టాలు చూసి వ్యవసాయంలో ఇంజనీరింగ్‌ను ఎంచుకున్నాను. 2015-2019 బ్యాచ్‌లో కంది పరిధిలోని వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో నా చదువును పూర్తి చేశాను. ప్రభుత్వ ఉద్యోగం సంపాదించడమే లక్ష్యంగా పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యాను. రోజుకు 10 గంటలు పట్టుదలతో చదివాను. నా కష్టానికి ఫలితంగా ఏఈఈ ఉద్యోగం రావడం చాలా ఆనందంగా ఉన్నది. రైతులకు నేస్తంలా ఉంటూ వారికి వ్యవసాయ రంగంలో మెళకువలు నేర్పిస్తా. పంటల్లో నూతన ఒరవడిని వివరించి అన్నదాతలకు మేలు జరిగేలా చూస్తా.

-చిలుకూరి ప్రమీల, చండూరు, నల్లగొండ

నీటి వినియోగంపై రైతులకు శిక్షణ ఇస్తా



నాన్న వెంకట్రావు తాపీ మేస్త్రి. అమ్మ యశోద గృహిణి. అద్దె ఇంటిలో ఉంటూ నాన్న రోజు పడే కష్టం చూడలేకనే ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని నిర్ణయించుకున్నా. 2014-2018 బ్యాచ్‌లో ఇంజనీరింగ్ పూర్తి చేశాను. అనంతరం ఒక సంవత్సరం పాటు అశోక్‌నగర్‌లోని ఓ స్టడీ సర్కిల్‌లో కోచింగ్ తీసుకుని ఏఈఈ ఉద్యోగం సాధించాను. చెరువుల కింది ఆయకట్టు రైతులకు నీటి వినియోగంపై శిక్షణ ఇస్తా. వ్యవసాయ రంగంలో ఆధునికతను ఉపయోగించి అన్నదాతలకు తోడ్పాటు అందిస్తా.

- కుంచాల ఉమా మహేష్, నాగోల్, హైదరాబాద్

చెరువు నీటి వృథాను అరికడుతా...



నాన్న సత్యారెడ్డి రైతు. అమ్మ కరుణ గృహిణి. మాది వ్యవసాయ కుటుంబం కావడంతో ఇంట్లో ఎక్కువగా వ్యవసాయం గురించే చర్చలు జరిగేవి. దీంతో వ్యవసాయ రంగంలో కొత్త ఒరవడి సృష్టించడానికి 2014-2018 బ్యాచ్‌లో కంది వ్యవసాయ కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేశాను. గంటల తరబడి చదివి ఏఈఈ ఉద్యోగం సాధించా. వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలపై దృష్టి సారిస్తా. రైతులకు నేస్తాంలా ఉంటూ చెరువుల్లోని నీరు వృథా కాకుండా చూస్తాను.

-హర్షవర్ధన్ రెడ్డి, మాందాపూర్, వనపర్తి

రోడ్డును బాగుచేయండి

- రోడ్డెక్కి ఆందోళన చేసిన గ్రామస్థులు
- ఓవర్‌లోడ్ లారీలతోనే పాడవుతున్నాయని ఆరోపణ
- సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ హామీతో ఆందోళన విరమణ
- రైల్వే గేటును మూసి వేయొద్దు : నాగిరెడ్డిపల్లి గ్రామస్థులు

జహీరాబాద్/కోహీర్, సెప్టెంబరు16 : పాడైన రోడ్లకు మరమ్మతులు చేయడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారని, వెంటనే రహదారులను బాగుచేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని అల్గోల్ గ్రామస్థులు సోమవారం ఆందోళనకు దిగారు. అధికారులు, నాయకులు ఇక్కడకు వచ్చేవరకూ ఆందోళనను విరమించబోమన్నారు. అల్గోల్‌చౌరస్తా నుంచి పోట్టిపల్లి మీదుగా ఎల్గోయి వరకు రోడ్డు అధ్వానంగా మారిందన్నారు. నాయకులకు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ఓ కంకర మిక్సింగ్ కర్మాగారం నుంచి ఓవర్‌లోడ్‌తో లారీలు నిత్యం ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తుండడంతో దారి గుంతలమయంగా మారిందని ఆరోపించారు. ఆ కర్మాగారం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలన్నారు. విషయం తెలుసుకున్న సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డా.సిద్దం ఉజ్వల్ రెడ్డి అక్కడికి చేరుకుని సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామని వారు హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

రైల్వే గేటు మూస్తే తీవ్ర అంతరాయం..

కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ శివారులోని 20వ నంబరు రైల్వే గేటును మూసివేస్తే రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని నాగిరెడ్డిపల్లి ప్రజలు రైల్వే అధికారులకు తమ సమస్యను వివరించారు. సోమవారం రైల్వే అధికారులు మండల రెవెన్యూ ఇనెస్పెక్టర్, మండల సర్వేర్ ఆధ్వర్యంలో ఆ రైల్వే గేటు వద్ద అండర్ బ్రిడ్జి ఏర్పాటుపై సర్వే నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న రైతులు అక్కడికి చేరుకొని రైల్వే గేటు మూసివేస్తే తమకు ఇబ్బంది అవుతుందని మొరపెట్టుకున్నారు.

నరకయాతన అనుభవిస్తున్నాం



జహీరాబాద్ పట్టణంలోని మాణిక్‌ప్రభు వీధి నుంచి సిద్దేశ్వరాలయం, రహ్మత్‌నగర్, అల్గోల్, పోట్టిపల్లి గ్రామాల మీదుగా ఎల్గోయి గ్రామం వరకు రోడ్డు దెబ్బతిన్నది. ఎలాంటి మరమ్మతులు చేయకపోవడంతో రాకపోకలు సాగించేందుకు నరకయాతన అనుభవిస్తున్నాం. రాత్రివేళల్లో ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును బాగుచేయాలి.

-నర్సింహులు, అల్గోల్



రోడ్డుపై ఆందోళన చేస్తున్న అల్గోల్ గ్రామస్థులు

రావి ఆకుపై నిజాం తలవంచిన చిత్రం

నారాయణఖేడ్, సెప్టెంబరు 16: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ పట్టణానికి చెందిన లీఫ్ ఆర్టిస్టు గుండు శివకుమార్ రావి ఆకులపై సర్దార్ పటేల్ ఎదుట నిజాం నవాబ్ తలవంచిన చిత్రంతో పాటు సర్దార్ పటేల్ చిత్రాలు వేయడంతో పలువురు ఆయనను అభినందించారు.



రావి ఆకులపై వేసిన వివిధ చిత్రాలు



నర్సాపూర్ బస్‌డిపో వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థినులు

బస్సుల కోసం విద్యార్థుల ధర్నా

నర్సాపూర్, సెప్టెంబరు 16: బస్సులు లేక కళాశాలలకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ జిన్నారం మండలం గడ్డపోతారానికి చెందిన విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం నర్సాపూర్ డిపో వద్ద ధర్నా చేశారు. ఈ సదర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ మండలంలోని గడ్డపోతారం, కిష్టాయిపల్లి తదితర గ్రామాల నుంచి చదువుకునేందుకు నిత్యం ఎంతోమంది విద్యార్థులు హైదరాబాద్‌కు వెళ్తుంటారన్నారు. గతంలో నర్సాపూర్ డిపో కాకముందు హైదరాబాద్ పరిధిలోని జీడిమెట్ల డిపో బస్సులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగించడంతో ఇబ్బందులు ఉండేవి కాదన్నారు. నర్సాపూర్ డిపో అయ్యాక తమ గ్రామాల నుంచి బస్సులు నడపకపోవడంతో సకాలంలో కళాశాలలకు వెళ్లలేకపోతున్నామన్నారు. తిరిగి జీడిమెట్ల డిపో బస్సులు నడిపించాలని కోరుతూ ధర్నా అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. విద్యార్థులకు మద్దతుగా గడ్డపోతారం మాజీ సర్పంచ్ శ్రీనివాస్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యంముదిరాజ్, నాయకులు ఆకులచిరంజీవి, నవీన్, కిరణ్ చారి ధర్నాలో పాల్గొన్నారు. ఈ విషయమై డిపో ఇన్‌చార్జి లక్ష్మణ్ మాట్లాడుతూ డిపో మేనేజర్ దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఉపాధ్యాయుడి మృతి.. నేత్రాలు దానం



వెంకటస్వామి నేత్రాలను దానం చేస్తున్న కుటుంబ సభ్యులు



వెంకటస్వామి(ఫైల్)

జగదేవ్‌పూర్/గజ్వేల్, సెప్టెంబరు 16: గుండెపోటుతో ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు మృతి చెందగా, ఇంత దుఃఖాన్ని దిగమింగుకుని ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. ఈ సంఘటన మండలంలోని అలిరాజపేటలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే గ్రామానికి చెందిన ధ్యాప వెంకటస్వామి(42) 11 ఏళ్లుగా ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. గజ్వేల్‌లోని మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఆయన ఇటీవలే జగదేవ్‌పూర్ ఆదర్శ పాఠశాలకు బదిలీలపై వచి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. కాగా, సోమవారం అలిరాజపేటలోని తన ఇంట్లో కాలకృత్యలకు వెళ్లిన ఆయనకు ఛాతిలో నొప్పి రావడంతో కుప్పకూలాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకటస్వామి భార్య మంజుల జగదేవ్‌పూర్ బాలికల పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. మృతుడికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఇంత దుఃఖంలోనూ సామాజిక స్పృహతో కుటుంబ సభ్యులు లోక్ నేత్ర ట్రస్టుకు వెంకటస్వామి కళ్లను దానం చేశారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ, మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, యూటీఎఫ్, టీపీటీఎఫ్ మండల అధ్యక్షులు సత్తయ్య, ప్రవీణ్, వెంకటస్వామి మృతదేహానికి నివాళులర్పించారు.

గంజాయి పట్టివేత

- నిందితుడి అరెస్టు

జహీరాబాద్ ,సెప్టెంబరు16 : పోలీసులు దాడి చేసి గంజాయిని స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టు చేశారు. జహీరాబాద్‌రూరల్ ఎస్ఐ ప్రసాదరావు కథనం ప్రకారం మండలంలోని హుగ్గెల్లి శివారులో శేఖాపూర్‌తండాకు చెందిన రాథోడ్ హరి అలియాస్ అర్జున్‌రాథోడ్ పవార్‌వేణు, చౌహాన్‌విజయ్, చౌహాన్ అర్జున్, చౌహాన్ సతీష్ అలియాస్ కిరణ్‌తో కలిసి కొన్నేళ్లుగా ఒరిస్సా బార్డర్ కొత్తగూడెం, బీదర్‌ల నుంచి గంజాయిని తీసుకు వచ్చి జహీరాబాద్ పరిసరప్రాంతాల్లో అమ్ముతున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న పోలీసులు హుగ్గెల్లి శివారులోని షాలిమార్ హోటల్ వెనుక శిరీష వెంచర్‌లో సోమవారం 5కిలోల గంజాయిని ప్యాకెట్లుచేసి అమ్ముతున్నక్రమంలో పోలీసులు పట్టుకున్నారు. అర్జున్‌రాథోడ్‌ను అదుపులోకి తీసుకోగా.. మిగతవారు పరారయ్యారు. వీరిపై కొత్తగూడం జిల్లా మణుగురు పోలీస్ స్టేషన్‌లో కేసులున్నాయని, పరారీలో ఉన్న నిందితులను త్వరలో పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

పాతి పెట్టిన బాలుడి మృతదేహానికి రీ పోస్టుమార్టం!

- ఆసుపత్రిపై బాలుడి తండ్రి ఫిర్యాదుతో..



దశ్విక్ (ఫైల్)

హత్నూర, సెప్టెంబరు 16: మండల పరిధిలోని కొన్యాల గ్రామంలో ఇటీవల మృతి చెందిన 45రోజుల బాలుడి మృతదేహానికి మంగళవారం రీ పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు తెలిసింది. గ్రామానికి చెందిన ప్రభులింగం, అనురాధ దంపతుల కుమారుడు దశ్విక్ తీవ్ర జ్వరంతో బాధపడుతుండగా.. తల్లిదండ్రులు సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఈ నెల 5న చేర్పించారు. చికిత్స పొందుతూ 8న మృతి చెందగా, ఆసుపత్రి వైద్యులు మాత్రం బాలుడి పరిస్థితి విషమంగా ఉందని.. నీలోఫర్ ఆసుత్రికి వెళ్లాలని వైద్యులు సూచించారు. దీంతో బాలుడి తండ్రి సంగారెడ్డి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఆ బాలుడు డెంగ్యూతో మృతి చెందాడా..? మరో ఏదైనా వ్యాధితో మృతి చెందాడా..? తెలుసుకునేందుకు పూడ్చి పెట్టిన బాలుడి మృతదేహానికి మంగళవారం పోస్టు మార్టం నిర్వహించనున్నట్లు తెలిసింది.

భార్యతో గొడవపడి ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రిలో మృతి

మనోహరాబాద్, సెప్టెంబరు 16 : భార్యతో గోడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ సుభాష్‌గౌడ్ కథనం ప్రకారం సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం ఏలూరుకు చెందిన మహ్మద్ నజీర్ (37)కు దండుపల్లి గ్రామానికి చెందిన నజ్మాసుల్తాన్‌తో 11 ఏళ్ల క్రితం వివాహమైంది. నజీర్ భార్యతో కలిసి అత్తగారి ఊరులో అద్దె గదిలో ఉంటూ ఓ పరిశ్రమలో పని చేస్తున్నారు. కల్లుకు బానిసై నజీర్ నిత్యం తాగి వచ్చి భార్యతో గొడవపడేవాడు. ఈ నెల 9న కూడా తాగివచ్చి గొడవపడడంతో భార్య తల్లిగారి ఇంటికి వెళ్లింది. సాయత్రం 6 గంటలకు తిరిగి రాగా.. పురుగుల మందు తాగినట్లు భర్త చెప్పాడు. దీంతో వెంటనే ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి ఎర్రగడ్డ ఈఎస్ఐ ఆసుపత్రికి తలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భార్య నజ్మ సుల్తాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

బెజ్జంకి, సెప్టెంబరు 16: ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గుండారం గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకున్నది. బెజ్జంకి పోలీసుల కథనం ప్రకారం.. రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం వెంకట్రావుపల్లికి చెందిన ఎనుసాల ముత్తయ్య (33) అనే వ్యక్తి గల్ఫ్ దేశాలకు వెళ్లి పని దొరకక తిరిగి వచ్చాడు. కొన్ని రోజులుగా వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో రూ.3 లక్షల వరకు అప్పులు కావడంతో తీసుకున్న ఎలా తీర్చాలని మనోవేదనకు గురై ఇంట్లో నుంచి వెళ్లి గుండారం గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, భార్య ఎల్లవ్వ ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

ఉచిత బస్సు సేవలు విస్తరణ

- ప్రత్యేక సర్వీసులు ప్రారంభించిన న్యూలాండ్ పరిశ్రమ



ఉచిత సర్వీసులో ప్రభుత్వ పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

జిన్నారం, సెప్టెంబరు 16: మహిళలు, విద్యార్థుల సౌకర్యార్థం జిన్నారం, గుమ్మడిదల మండలాల్లోని న్యూలాండ్ పరిశ్రమ యాజమాన్యం చేపట్టిన ఉచిత బస్సు సర్వీసు సేవలను మరింతంగా విస్తరించింది. జిన్నారం మండలలోని ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యార్థుల కోసం ఇప్పటికే ఓ బస్సును నడుపుతుండగా.. వివిధ గ్రామాల మహిళలు, ఇతర పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల కోసం తాజాగా మరో బస్సు సర్వీసును ప్రారంభించింది. ఈ బస్సుల్లో నిత్యం 250 మంది విద్యార్థులు ప్రయాణిస్తున్నారు. జిన్నారం శివారులో ఉన్న విద్యా సంస్థలకు వెళ్లేందుకు విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు కలుగుతుండగా ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి చొరవతో పరిశ్రమ యాజమాన్యం బస్సు సేవలు కల్పించింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



ఘటనా స్థలంలో గాయాలతో హనుమాండ్లు

అల్లాదుర్గం, సెప్టెంబరు 16 : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ ప్రవీణ్ రెడ్డి కథనం ప్రకారం కామారెడ్డి జిల్లా మహ్మద్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని నడిమి తండా గిర్నితండాకు చెందిన గుగులోతు హనుమాండ్లు (42) ఆదివారం రాత్రి బైకుపై అల్లాదుర్గం మీదుగా 161 జాతీయరహదారిపై వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు బైకుపై నుంచి పడి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతడిని కుటుంబీకులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి సోదరుడు గుగులోతు మోహన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చదువుకున్న పాఠశాలకు ఏటా రూ.లక్ష విరాళం

- పూర్వ విద్యార్థి నిర్ణయం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

సిద్దిపేట అర్బన్,సెప్టెంబరు 16 : సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులకు పూర్వ విద్యార్థి, చార్టెడ్ అకౌంటెంట్ జెట్టి మల్లేశం రూ.లక్షను విరాళంగా అందజేశారు. సోమవారం పాఠశాలలో 1995-96లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఎన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన జెట్టి మల్లేశం ప్రస్తుతం హైదరాబాదులో చార్టెడ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా జెట్టి మల్లేశం మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలలో మౌలిక వసతుల మెరుగుదల, విద్యార్థులు చదువులో రాణించేలా ప్రోత్సహించడానికి తన వంతుగా ఆర్థిక సాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఇతరులు కూడా ముందుకు వచ్చి చేయూతనివ్వాలన్నదే తన ఉద్దేశమన్నారు. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం లక్ష రూపాయలను పాఠశాలకు విరాళంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఇలా పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాల బాగోగులు చూసుకోవడానికి ముందుకు వస్తే ప్రతి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ఎదిగి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు. ఉదార హృదయంతో పాఠశాల అభివృద్ధి కోసం ముందుకు వచ్చిన పూర్వ విద్యార్థి జెట్టి మల్లేశంను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దేవర కనకయ్య, జోగు వెంకటేశ్వర్లు, మాధవి, సువర్ణ, లత, నరేష్, రమణారెడ్డి, ఐలయ్య పూర్వ విద్యార్థులు స్కైలాబ్ రెడ్డి, రమణారెడ్డి, జానీ, గణపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

108లో కవలలు ప్రసవం



కౌడిపల్లి, సెప్టెంబరు 16: పురుటి నొప్పులతో బాధపడుతున్న తల్లిని 108లో చికిత్స నమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో కవలపిల్లలకు జన్మనిచ్చింది. మండలంలోని నాగ్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన నాగలక్ష్మి అనే మహిళ పురిటి నొప్పులు రావడంతో వెంటనే గ్రామానికి చెందిన ఆశ వర్కర్ సహకారంతో మెదక్ ఏరియా అసుపత్రికి తరలించారు. వైద్యుల సుచనతో అక్కడి నుంచి హైదరాబాద్‌లోని నిలోఫర్‌కు 108 లో తరలిస్తుండగా, పురుటి నొప్పులు అధికమై కాన్పు అయ్యింది. దీంతో అంబులెన్స్‌లోనే ఇద్దరు మగ పిల్లలకు జన్మనిచ్చింది. నాగలక్ష్మి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆశ వర్కర్, 108 సిబ్బందిని అభినందించారు.

క్రీడలకు కోచ్‌లేరీ..?

- ఏడాది క్రితం జిమ్నాస్టిక్, గత నెల స్విమ్మింగ్ కోచ్‌లు బదిలీ
- శిక్షకులు లేని సంగారెడ్డి జిల్లా క్రీడాప్రాధికార సంస్థ
- నిరాశలో క్రీడాకారులు.. నియమించాలని వేడుకోలు

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 16 : క్రీడలు, క్రీడాభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రభుత్వాలు, అధికారులు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో ఆ పరిస్థితి కనిపించడం లేదు. జిల్లాలో ఒక్క క్రీడా శిక్షకుడు కూడా లేకపోవడంతో క్రీడాకారులు ఆటలకు దూరమవుతున్నారు. దీంతో క్రీడాభివృద్ధి కుంటుపడుతున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఒక్క కోచ్ లేని క్రీడాప్రాధికార సంస్థ..

సంగారెడ్డి జిల్లా క్రీడాప్రాధికార సంస్థలో ఒక్క కోచ్ కూడా లేరు. 2013 నుంచి పనిచేసిన ఓ జిమ్నాస్టిక్ కోచ్ ఏడాది క్రితం బదిలీ అయ్యారు. ఇక ఆ సంస్థ ఆధీనంలో స్విమ్మింగ్ పూల్ కొనసాగిస్తుండగా, దానికి 2019లో స్విమ్మింగ్ కోచ్‌ను నియమించినప్పటికీ, గత నెల 22న ఆయన కరీంనగర్‌కు డీవైఎస్‌వోగా పదోన్నతిపై వెళ్లారు. దీంతో జిల్లాలో కోచ్‌లు లేకుండా పోయారు. ఫలితంగా స్విమ్మింగ్ పూల్ ఎలాంటి కోచ్ లేకుండానే నిర్వహిస్తున్నారు.

శిక్షకులు లేక ఇబ్బందులు..

క్రీడల్లో ప్రావీణ్యం సంపాదించాలంటే శిక్షకులు అవసరం. శిక్షకులు లేకపోవడంతో నైపుణ్యం తగ్గిపోయి క్రీడా కోటలో సీట్లు, ఉద్యోగాలు కోల్పోవాల్సి వస్తుందని పలువురు క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం శిక్షకులను నియమించి క్రీడాకారులను ప్రోత్సహించాలని క్రీడాకారులు, క్రీడా సంఘాల నాయకులు కోరుతున్నారు.



ప్రతిపాదనలు పంపాం..



జిల్లాలో కోచ్‌లు లేని మాట వాస్తవమే. ఉన్న ఒక్క స్విమ్మింగ్ కోచ్ ఇటీవల బదిలీ అయ్యారు. అన్ని క్రీడాంశాలకు సంబంధించిన కోచ్‌లను నియమించాలని ఇటీవల కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. క్రీడలు, క్రీడాభివృద్ధి కృషి చేస్తాం.

-ఖాసింబేగ్, డీవైఎస్‌వో, సంగారెడ్డి జిల్లా



సంగారెడ్డిలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ పరిధిలోని డా.బి.ఆర్.అంబేద్కర్ స్టేడియం

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: మెదక్ ఎస్పీ


ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, సెప్టెంబరు 16: పోలీసు ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి

జోగిపేట, సెప్టెంబరు 16: మండలంలోని రోళ్లపహాడ్‌కు చెందిన వ్యక్తి ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడి మృతి చెందాడు. ఎస్‌ఐ పాండు తెలిపిన వివరాల ప్రకారం.. రోళ్లపహాడ్ గ్రామానికి చెందిన గొల్ల వీరన్న(45) ఆదివారం రాత్రి మూత్రవిసర్జన కోసం ఇంటి బయటకు వచ్చి, ప్రమాదవశాత్తు మురుగుకాలువలో పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అనారోగ్యంతో విద్యార్థిని మృతి


వర్ష(ఫైల్)

హవేళిఘణపూర్, సెప్టెంబరు 16: మండలంలోని సర్దన గ్రామానికి చెందిన ఓ విద్యార్థిని అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. సర్దన గ్రామానికి చెందిన పిల్లి కృష్ణ-భాగ్య దంపతుల కుమార్తె వెంకటలక్ష్మి అలియాస్ వర్ష(16) పదోతరగతి చదువుతున్నది. చదువులో తరగతిలో టాపర్ గా నిలుస్తూ పాఠశాలలోనే కాకుండా గ్రామంలో మంచి గుర్తింపు పొందింది. ఆట, పాటల్లో కూడా చురుకుగా ఉండేది. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధ పడుతూ హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌ల్లో చికిత్స పొందుతూ మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతి పట్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు విచారం వ్యక్తం చేశారు.

దాతర్‌పల్లిలో ఎలక్ట్రీషియన్ అదృశ్యం


గణేష్

తూప్రాన్, సెప్టెంబరు 16: కంపెనీలో పని ఉందని వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన తూప్రాన్ మండలం దాతర్‌పల్లిలో ఆదివారం చోటు చేసుకున్నది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలం దాతర్‌పల్లి గ్రామానికి చెందిన కొలిచెలిమే గణేశ్ (25) మండలంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. సాయంత్రం ఫోన్‌కాల్ రావడంతో కంపెనీలో పని ఉందంటూ వెళ్లి తిరిగిరాలేదు. రాత్రి ఇంటికి రాకపోగా, మొబైల్ ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో తండ్రి మల్లేశం సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

తునికిలో ద్విచక్ర వాహనం చోరీ


సీసీ కెమెరా పుటేజీ

కౌడిపల్లి, సెప్టెంబరు 16: మండలంలోని తునికిలో ఆదివారం ఓ ద్విచక్రవాహనం చోరీ జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తునికి గ్రామానికి చెందిన పట్వారి నర్సింహులు నల్ల పోచమ్మ ఆలయం వద్దకు ద్విచక్ర వాహనం(స్కూటీ)పై వచ్చి పార్క్ చేశారు. అమ్మవారిని దర్శించుకుని వచ్చే లోపు గుర్తు తెలియని దుండగులు వాహనాన్ని అపహరించారు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఆలయం వద్ద ఉన్న సీసీ కెమెరాలో వాహనం తీసుకుని వెళ్లే దృశ్యాలు రికార్డు అయ్యాయి. దీంతో పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

ఏఐఎఫ్‌టీవో సెక్రటరీగా మహమ్మద్ అబ్దుల్లా

సంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 16: ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ టీచర్స్ ఆర్గనైజేషన్(ఏఐఎఫ్‌టీవో)సెక్రెటరీగా మహమ్మద్ అబ్దుల్లా ఎన్నికయ్యారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రాజధాని లక్నోలో సోమవారం జరిగిన ఏఐఎఫ్‌టీవో జాతీయ సదస్సులో ఆయనను ఎన్నుకున్నారు. పీఆర్టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ అబ్దుల్లా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా అబ్దుల్లా మాట్లాడుతూ జాతీయస్థాయిలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

డప్పు కొట్టకుంటే కుల బహిష్కరణ చేస్తారా?: సీపీఎం

నర్సాపూర్, సెప్టెంబరు 16: మండలం గొతోజిగూడ గ్రామంలో డప్పు కొట్టకుంటే కుల బహిష్కరణ చేయడం ఎంతవరకు సమంజసమని సీపీఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి కె.నాగరాజు తీవ్రంగా ఖండించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉన్నతచదువులు చదివిన యువకులను వృత్తి నెపంతో డప్పు కొట్టకుంటే గ్రామం నుంచి బహిష్కరిస్తామని చెప్పడం దారుణమన్నారు. కుల బహిష్కరణ ప్రకటన చేసిన అందరిపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోరారు.






జహీరాబాద్: రాంనగర్, ఆర్యనగర్ నుంచి వినాయక విగ్రహాల నిమజ్జన ఊరేగింపు


జహీరాబాద్: కొత్తూర్(బి) సమీపంలోని నారింజ ప్రాజెక్టుకు తరలుతున్న వినాయక ప్రతిమలు


కల్హేర్‌లో వినాయక ప్రతిమను నిమజ్జనం చేస్తున్న యువకులు


నారాయణఖేడ్: కమలాపూర్ చెరువులో వినాయ విగ్రహాల నిమజ్జనం చేస్తున్న యువకులు

గంగమ్మ బాటలో గణపయ్యలు


హవేళిఘణపూర్: వాహనాల్లో నిమజ్జన శోభాయాత్రకు సిద్ధమైన వినాయక ప్రతిమలు


పెద్దశంకరంపేట: వినాయక నిమజ్జన శోభాయాత్రలో భక్తులు


చిన్నశంకరంపేట: అంబాజీపేటలో భక్తుల పూజలందుకున్న వినాయకుడు


వెల్దుర్తి: వినాయక నిమజ్జనానికి ముందు పూజలు నిర్వహిస్తున్న చిన్నారులు, భక్తులు

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో ఘనంగా పూజలందుకున్న గణపయ్య ప్రతిమలు గంగమ్మ ఒడికి చేరుకుంటున్నాయి. సోమవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని పలు మండలాల్లో గణేష్ నిమజ్జన యాత్రలు అట్టహాసంగా కొనసాగాయి. అందంగా అలంకరించిన వాహనాల్లో విగ్రహాలను తరలిస్తూ భక్తుల కోలాటాలు, భజనలు, నృత్యాల మధ్య నిమజ్జన శోభాయాత్రలు ఆసాంతం సందడిగా కొనసాగాయి.

జహీరాబాద్, సెప్టెంబరు 16: వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగింపుదశకు చేరుకోగా జహీరాబాద్‌లో మండలంలో పలుచోట్ల సోమవారం తెల్లవారు జాము నుంచే నిమజ్జన యాత్రలతో సందడి వాతావరణం నెలకొన్నది. జహీరాబాద్ పట్టణంలో 156 వినాయకవిగ్రహాలను ప్రతిష్ఠించగా, ఇప్పటివరకు 80విగ్రహాలను నిమజ్జనం చేశారు. మరో 76పైచిలుకు వినాయక విగ్రహాలను ఈ నెల 17న నిమజ్జనం చేయనున్నారు. మంగళవారం తెల్లవారుజామున నిమజ్జనానికి వినాయవిగ్రహాలు తరలివెళ్లడంతో నారింజప్రాజెక్టు వద్ద రోడ్డుపై వినాయక విగ్రహాలతో వాహనాలు బారులు తీరాయి. అనంతరం ఒకొక్కటిగా వినాయక విగ్రహాలను నారింజలో నిమజ్జనం చేశారు. జహీరాబాద్ పట్టణంలోని ఆయా మండపాల్లో ప్రతిష్ఠించిన మరో 76 వినాయక ప్రతిమలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం ఆయా మండపాల వద్ద వివిధరకాల సాంస్కృతిక కార్యక్రమాలను చేపట్టారు.

● కల్హేర్: మండల కేంద్రంలో సోమవారం ఉదయం వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. కల్హేర్‌లోని పరమేశ్వర, ఈశ్వర యువజన సంఘాల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలను ఊరేగింపుగా తరలించి స్థానిక కాముని చెరువులో నిమజ్జం చేశారు.

● నారాయణఖేడ్: నారాయణఖేడ్ ప్రాంతంలో సోమవారం వినాయక నిమజ్జన కార్యక్రమాలు కొనసాగాయి. ఖేడ్ పట్టణంలోని వినాయక విగ్రహాలతో పాటు వివిధ గ్రామాలకు చెందిన వినాయక విగ్రహాలను పట్టణ శివార్లలోని కమలాపూర్ చెరువులో నిమజ్జనం చేశారు.

● హవేళిఘణపూర్: మండలవ్యాప్తంగా సోమవారం గణేష్ విగ్రహాలను పురవీధుల గుండా నిమజ్జన శోభాయాత్రలను నిర్వహించి చెరువుల్లో నిమజ్జనం చేశారు. యువకుల డాన్సులతో పాటు లడ్డూ, పండ్లు, శాలువాల వేలం పాటలు ఉత్సాహంగా నిర్వహించారు.

● పెద్దశంకరంపేట: మండల పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై వినాయక విగ్రహాలను పురవీధుల గుండా భజనలు, కీర్తనల మధ్య యువకులు నృత్యాలు చేస్తూ నిమజ్జనానికి తరలించారు. తిరుమలాపూర్ చెరువులో వినాయక నిమజ్జనం చేశారు.

● చిన్నశంకరంపేట: మండల కేంద్రంతో పాటు అంబాజీపేట, శాలిపేట, చందంపేట తదితర గ్రామాల్లోని వినాయకుడికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు లడ్డూ వేలం పాటల్లో పాల్గొని దక్కించుకునేందుకు పోటీలు పడ్డారు. సాయంత్రం నిమజ్జన శోభాయాత్ర డప్పు, సన్నాయిల మధ్య వైభవంగా కొనసాగింది. అనంతరం చెరువులలో గణేష్‌ను నిమజ్జనం చేశారు.

● వెల్దుర్తి: వెల్దుర్తిలోని హనుమాన్ ఆలయంలో హనుమాన్ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడి నిమజ్జన శోభాయాత్రను సోమవారం ఘనంగా నిర్వహించారు. శోభాయాత్రలో యువకులు ఉత్సాహంగా భజనలు, నృత్యాలు చేశారు. అంతకు ముందు వినాయకుడి లడ్డూకు వేలం పాట ఆసక్తికరంగా కొనసాగింది.

గణపతి లడ్డూకు క్రేజ్


మనోహరాబాద్: కాళ్లకల్‌లోని వరసిద్ధి వినాయక మండపంలో లడ్డూను దక్కించుకున్న మల్లేష్‌గౌడ్

మనోహరాబాద్, సెప్టెంబరు 16: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో లడ్డూల వేలం పాటలు పోటాపోటీగా కొనసాగుతున్నాయి. కాళ్లకల్ గ్రామంలోని ఓ వినాయక మండపంలో లడ్డూ కోసం నిర్వహించిన వేలంపాటలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి అధిక ధరకు పాడి లడ్డూను కైవసం చేసుకున్నారు. కాళ్లకల్ గ్రామంలోని వరసిద్ధి వినాయక ఆలయంలో సోమవారం నిర్వహించిన గణపతి లడ్డూ వేలం పాటలో రూ.70వేలకు అదే గ్రామానికి చెందిన మద్దూరి మల్లేష్‌గౌడ్ కైవసం చేసుకున్నాడు. వేలం పాటలో మాజీ ఎంపీపీ పురంనవనీత రవి, మాజీ ఉపసర్పంచ్ కాళీదాస్, భాస్కరరావు, వాసువర్మ, ఆగిరెడ్డి, మద్దూరి శ్రీపాల్‌గౌడ్, సాయి కుమార్‌గౌడ్, శేఖర్‌గౌడ్, మద్దూరి నరేందర్ గౌడ్ పోటీపడగా మల్లేష్‌గౌడ్ లడ్డూ కైవసం చేసుకున్నారు.

● సంగారెడ్డి రూరల్: వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా సంగారెడ్డిలోని శివాజీనగర్‌లో గల బాల వినాయకుని లడ్డూకు పోటీ పెరిగింది. రూ. వెయ్యితో ప్రారంభమైన వేలం పాట రూ.33,500 వరకు పలికింది. ఈ వేలం పాటలో సుమారు 15 మంది పాల్గొనగా నాగరాజు అత్యధిక వేలం పాడి లడ్డూను దక్కించుకున్నాడు. అనంతరం శోభాయాత్రలో యువతులు, మహిళల దాండియా నృత్యాలు, కోలాటాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వినాయక మండప నిర్వాహకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి డీఈఐఈడీ పరీక్షలు

● మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్

మెదక్ అర్బన్, సెప్టెంబరు 16: ఈ నెల 17 నుంచి 23వ తేదీ వరకు డీఈఐఈడీ, డీపీఎస్ఈలో ఫెయిలైన అభ్యర్థులకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. 2022-23 అంతకు ముందు ఫెయిలైన అభ్యర్థులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.

విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి: బీజేపీ

నారాయణఖేడ్, సెప్టెంబరు 16: తెలంగాణ విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ మండల అధ్యక్షుడు సిందోల్ దశరథ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 1948 సెప్టెంబరు 17న సర్దార్ వల్లభాయ్ పటేల్ చేపట్టిన పోరాటం ఫలితంగా, తెలంగాణకు విముక్తి లభించిందన్నారు. ప్రభుత్వం అధికారికంగా విమోచన వేడుకలు నిర్వహించకుండా, ప్రజా పాలన దినోత్సవాన్ని ప్రకటించడం ఎంఐఎం నాయకులను తృప్తి పర్చడం కోసమేనన్నారు. సర్దార్‌పటేల్ విగ్రహాన్ని హైదరాబాద్‌లో సైతం ఏర్పాటు చేయాలన్నారు.

నిమజ్జనంలో పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

● జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి


జహీరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడి

జహీరాబాద్, సెప్టెంబరు 16: ఈ నెల 17న జహీరాబాద్ పట్టణంతో పాటు, వివిధమండలాల్లో నిర్వహించే వినాయక నిమజ్జనంలో పోలీసులు అప్రమత్తం పనిచేయాలని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని వీవీఆర్ ఫంక్షన్‌హాల్‌లో డివిజన్‌స్థాయి పోలీసులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక నిమజ్జనం సందర్భంగా 130 మంది పోలీసు సిబ్బంది విధుల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ముగ్గురు సీఐలు, 9మంది ఎస్‌ఐలు, నలుగురు ఏఎస్‌ఐలు 15మంది హెడ్‌కానిస్టేబుళ్లు, 89మంది పోలీసులు పాల్గొంటున్నట్లు తెలిపారు. అలాగే 8మఫ్టీ బృందాలను ఏర్పాటు చేశారు. విధినిర్వహణలో నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందులు తప్పవనే విషయాన్ని పోలీసులు గమనించాలన్నారు. ఎక్కడ సమస్యలు తలెత్తినా వెంటనే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేయాలన్నారు. మండపాల నిర్వాహకులు పోలీసులకు, అధికారులకు, సార్వజనిక్ ఉత్సవకమిటీ సభ్యులకు సహకరిస్తూ నిమజ్జనఉత్సవాలను విజయవంతం చేద్దామన్నారు. డీజేతో శోభాయాత్ర చేపడితే ఉపేక్షించబోమన్నారు. ఊరేగింపు సమయాల్లో ఎవరు కూడా రెచ్చగొట్టే ప్రసంగాలు చేయరాదన్నారు. సమావేశంలో సీఐలు శివలింగం, హన్మంతు, ఎస్‌ఐలు కాశీనాథ్, ప్రసాదరావు, రాజేందర్‌రెడ్డి, నరేష్, రామానాయుడు, పోలీసులు పాల్గొన్నారు.

డీజేకు అనుమతులు లేవు

అల్లాదుర్గం, సెప్టెంబరు 16: వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా జరుపుకోవాలని అల్లాదుర్గం ఎస్‌ఐ.ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలో నిర్వహించనున్న నిమజ్జన కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని, డీజే సౌండ్‌కు ఎలాంటి అనుమతి లేదని, లేజర్ లైటింగ్ ఏర్పాటు చేస్తే ఆయా మండపాల నిర్వాహకులపై చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

ఘనంగా మిలాద్-ఉన్-నబీ


మనూరు: రాయిపల్లిలో ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు జరుపుకుంటున్న ముస్లింలు

సంగారెడ్డి రూరల్, సెప్టెంబరు 16: సంగారెడ్డి జిల్లాకేంద్రంలో సోమవారం మిలాద్-ఉన్-నబీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక జామే మసీద్ కమిటీ అధ్యక్షుడు డా. మహమ్మద్‌గౌస్ ఆధ్వర్యంలో జామే మసీద్‌లో ప్రవక్త ముహమ్మద్ సలల్లామునై సల్లం అలైహీవ సల్లం ఆసారే ముబారక్‌ను దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంబీటీ స్పోక్స్ మాన్ అంజద్ ఉల్లాఖాన్, డా.గౌస్ తదితరులు పాల్గొన్నారు.

● మనూరు: మండలంలోని రాయిపలిలో సోమవారం ముస్లిం సోదరులు ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినం ను పురస్కరించుకొని, ఈ వేడుకలు జరుపుకుంటామని ముస్లిం మత పెద్దలు తెలిపారు. గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జామేమసీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

● నాగల్‌గిద్ద: మహమ్మద్ ప్రవక్త జన్మదిన పురస్కరించుకొని మండల పరిధిలోని కరసగుత్తి, ఏన్కీ, ఉట్‌పల్లి, వల్లూర్, తదితర గ్రామాల్లో సోమవారం మిలాద్-ఉన్-నబీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మహమ్మద్ ప్రవక్తను స్మరించుకుంటూ గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు.

● మనోహరాబాద్: మండల కేంద్రంలో మహమ్మద్ ప్రవక్త జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మిలాద్-ఉన్-నబీ పండుగ సందర్భంగా మనోహరాబాద్ మసీద్ నుంచి గ్రామంలోని జాతీయ రహదారి చివరి వరకు ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో మసీద్ మతపెద్దలు ఎండీ జావేద్ పాషా, అజీజ్‌ఖాన్, షర్ఫుద్దీన్, రఫీక్, ఉస్మాన్, ఫహీం రజాక్, సమద్, మోయిజ్ సమీయోద్దీన్ షరీఫ్ పాల్గొన్నారు.

కాలువను కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకోవాలి


పంట పొలంలో నుంచి తీసిన కాలువను పరిశీలిస్తున్న రైతులు

శివ్వంపేట, సెప్టెంబరు 16: ఫాంహౌస్ నిర్మాణం కోసం కుంట కట్టు కాలువను పూడ్చి వేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని సోమవారం రైతులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని దంతాన్‌పల్లిలో హైదరాబాద్‌కు చెందిన రాకేష్‌రెడ్డి వ్యవసాయ పొలాన్ని కొనుగోలు చేశాడు. అనంతరం ఫాంహౌస్ నిర్మాణం కోసం మెల్లకుంట నుంచి నీళ్ల వెళ్లే కాలువను పూడ్చి వేసి ప్రహరీ నిర్మాణం చేపట్టి తమ పొలంలో కాలువ తీశాడని రైతు గడ్డం రాజు ఆవేదన వ్యక్తం చేశాడు. కుంట కాలువ పూడ్చివేయడంతో పంట పొలాలకు నష్టం కలుగుతుందని, కుంట కాలువ కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకొని కాలువను పునరుద్ధరించాలని రైతులు డిమాండ్ చేశారు.

టీచర్లకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలి

● కేంద్ర సహాయ మంత్రి బండిసంజయ్‌కు ఎస్టీటీయూ నాయకుల వినతి


బండి సంజయ్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎస్టీటీయూ నాయకులు

వెల్దుర్తి, సెప్టెంబరు 16: ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలని సోమవారం ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర హోం వ్యవహారాలశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డితో కలిసి ప్రధాన కార్యదర్శి వెంకటేశం వినతిపత్రాన్ని అందజేశారు. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పదోన్నతుల్లో డీఎడ్, బీఎడ్ కామన్ సీనియారిటీతో అర్హత గల ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని, పూర్వ ప్రాథమిక విద్యను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేయాలని కోరారు. జాతీయ నూతన విద్యా విధానం అమలుపరుస్తున్న క్రమంలో ప్రాథమిక స్థాయిలో తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడు, ప్రతీ ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుడు ఉండాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుపరచి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన మంత్రి తప్పకుండా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు కల్పిస్తామని, కామన్ సీనియార్టీతో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఎస్‌సీటీఈ నిబంధనలో సవరణ ద్వారా పోస్టుల పదోన్నతులు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

గందరగోళంగా వార్డులవారీ ఓటరు జాబితా

రేగోడు సెప్టెంబరు 16: గ్రామపంచాయతీల ఎన్నికల కోసం గ్రామాలు, వార్డులవారీగా ఓటరు జాబితాను ఆయా గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేశారు. వార్డుల వారీగా చేసిన ఓటర్ జాబితాలో కుటుంబాల ఓటర్ల విషయంలో గందరగోళం నెలకొన్నది. గత పంచాయతీ ఎన్నికల్లో క్రమం ప్రకారం ఉన్న ఓటరు జాబితా తారుమారు కావడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా నమోదు చేసుకున్న ఓటర్లను ఆయా వార్డులవారీగా కుటుంబ సభ్యుల జాబితాలో చేర్చాల్సిందిపోయి కుటుంబ సభ్యులను వేర్వేరు వార్డుల్లో ఓటర్లుగా నమోదు చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రేగోడులో 12 వార్డులు ఉండగా ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లను 9వ వార్డు, 12వ వార్డులో చేర్చారు. ఓటరు జాబితా సవరణకు ఈ నెల 23 వరకు అవకాశముందని, గ్రామ కార్యదర్శులకు ఫిర్యాదు చేస్తే సవరణ చేస్తారని మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తెలిపారు.

సాయుధ రైతాంగ పోరాట వారసులు కమ్యూనిస్టులు

నారాయణఖేడ్, సెప్టెంబరు 16: వెట్టి చాకిరి నుంచి ప్రజలకు విముక్తి కల్పించింది తెలంగాణ సాయుధ పోరాటమేనని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాణిక్ అన్నారు. సోమవారం ఖేడ్‌లో కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం , వెట్టి చాకిరి నుంచి విముక్తి కోసం సాగిన మహోత్తర రైతాంగ పోరాటంలో అమరులను స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు నల్లవల్లి రమేష్, సతీష్, అరుణ్, సంతోష్, కాన్షీరాం, పండరి, బాబు, తదితరులు పాల్గొన్నారు.